


అభ్యర్థుల నిట్టూర్పులతో ఇంటర్వ్యూ హాలు క్రమేపీ వేడెక్కుతోంది. తుమ్ములు, దగ్గులు అనవసరమైన ఆవలింతలు ఎక్కువ అవుతున్నాయి. షెడ్యూల్ టైముకి ఓ గంట ముందే అభ్యర్థులు సెంట్ పర్సెంట్ హాజరు అయ్యారు.

హాలునిండా బిలబిలా కదలికలు, గలగలా కబుర్లు. జస్ట్ ఫన్‌కోసం వచ్చినవాళ్ళు, చచ్చి చెడి వచ్చినవాళ్లు, ఉంగరాలు తాకట్టుపెట్టుకున్నవాళ్లు, ఉద్యోగం రాకపోతే ఆత్మహత్యకు పూనుకోవాలనుకునేవాళ్లు ఎందరో వచ్చారు.

కొందరు కాలు నిలవక అటుయిటు అడుగులేస్తుంటే కొందరు దిండుసైజు 'ఐ అండ్ క్యూ'లు తిరగేస్తున్నారు. 'ఇంటర్వ్యూ ఎలా ఎదుర్కోవాలి' అనే అంశంమీద కొందరు ఏకపాత్రాభినయం చేస్తున్నారు. కష్టసుఖాలు చెప్పుకునేవాళ్లు, కన్నీళ్లు పెట్టుకునేవాళ్లు, శతాధిక ఇంటర్వ్యూలు చూసి స్మశాన వైరాగ్యం ప్రదర్శించేవాళ్లు — ఇంటర్వ్యూ పేరుతో ఒకచోట కలిసారు. వోణీలు చీరలు పంచెలు,పాంట్లు, నెక్‌టైలు, నెక్‌లేసులు మల్లెలు మరువాలు ... హడావుడి పడ్తున్నాయి.

సూదంటురాయిలాంటి ఓ యువకుడు "లేడీస్ అండ్ జెంటిల్మెన్" అని తమాషాగా అడ్రస్ చేసి అందర్నీ ఆకర్షించాడు. ఎర్రగా బుర్రగా ఉన్నాడు. అందరికీ కనిపించాలని ఓ స్టూలు ఎక్కి అధికారానికి రాబోయే పార్టీ నాయకుడిలా ప్రామిసింగ్‌గా నిలబడ్డాడు. మిగతావాళ్లకున్న ఆశ, ఆత్రుత, బాధ, భయం, బెంగ, అనుమానం ఆరాటం అతని మొహంలో లేవు. ఉల్లాసంగా నవ్వుతూ ప్రఫుల్లంగా వున్నాడు. "కమ్ క్లోజ్ టు మీ"అంటూ ఆహ్వానించాడు.అమ్మాయిలు అబ్బాయిలు రంగులరాట్నం చుట్టూ జనంలా మూగారు.

ఇంటర్వ్యూ ముందు మహత్తర సందేశం అందించేవాడిలా గొంతు సవరించుకుని ప్రారంభించాడు.

"డియర్ ఫ్రెండ్స్, మనం ఎంత

అజ్ఞానంలో ఉన్నామో మన సంఖ్య చూసుకుంటే తెలుస్తుంది సుమారు మూడు వందల మంది ఉంటాము. ఇక్కడ ఉన్నది ముచ్చటగా ఒకే ఒక ఖాళీ. ఆ ఖాళీ నింపే రహస్యం 'మహా కాళీ'కి తప్ప ఎవరికీ తెలీదు," అని ఆగాడు.

"ఆ 'ఖాళీ' నీకు వదిలిపెట్టి మమ్మల్ని యిళ్లకి వెళ్లిపొమ్మంటావా?" అని ప్రశ్నించాడో గడుసుపిండం.

"క్షమించాలి ఫ్రెండ్స్. ఉపన్యాసం మధ్యలో అడ్డుతగలకండి. యివాళ నాకు ఆవేశం వచ్చింది. హృదయం విప్పి మీతో మాట్లాడాలనుకున్నాను, మాట్లాడేస్తున్నాను. అంతే. పస్తులుండి, అప్పులుచేసి నానా యిబ్బందులు పడి ఇంటర్వ్యూకు రావడమే ఒక గండంలా వచ్చినవాళ్లున్నారు మనలో. కానీ వాళ్లకి మిగిలేది ఖాళీ జేబులు. అవునంటారా? కాదంటారా?" అన్నాడు.

"కరెక్ట్."

"అవును."

"నిజం."

"చాలు ఫ్రెండ్స్. నా ఉపన్యాసానికి గొప్ప రెస్పాన్స్ వచ్చింది. ఈ సంతృప్తి చాలు. నాకు ఉద్యోగం వచ్చినా రాకపోయినా ఫర్వా లేదు. మరయితే 'గొయ్యి' అని తెలిసి కూడా మనం యిందులోనే దిగబడుతున్నాం. అవునా?"

వాళ్లు జవాబు చెప్పేలోగా అతనే అన్నాడు.


"పొరబాటు నాదే. మనం పట్టువదలని విక్రమార్కులం. ఎన్ని ఇంటర్వ్యూలు పోయినా వెళ్తాం. మళ్లీ మళ్లీ వెళ్తాం. ఒక ఖాళీ అయినా అరకాళీ అయినా అసలు ఖాళీలేకపోయినా—బొట్టుపెట్టి అకువక్క, పళ్లు ఇస్తారని తెలిస్తే అది యింటర్వ్యూ అయితే పరుగెత్తుకు వెళ్తాం. ఇంటర్వ్యూకెళ్లడం మన జన్మహక్కు. ఉద్యోగం రాకపోతే 'దేవుడే' దిక్కు.

"అయ్యో నా ఉపన్యాసం పక్కదారి పడుతోంది. యిందాక ఏం చెప్పాను? ఒక్క ఖాళీ అయినా సరే—'ఆ అదృష్టవంతులం మనమేమో'నని భ్రమపడి కదూ మనం తరతరాలుగా ఇంటర్వ్యూలు చూస్తున్నాం.

"మై లెర్నెడ్ ఫ్రెండ్స్! ఆ 'ఒక్కరూ' మనం ఎప్పటికీ కాలేము. క్షమించాలి ఈ ఉపన్యాసానికి ఒకర్ని మినహాయించాలి. విజయలక్ష్మి వరించబోతున్న ఆ మహానుభావుడు మనలో ఒకరు. నంగనాచి తుంగబుర్ర! చాప కింద నీరులా చల్లగా చేరాడు. అడ్వాన్సుగా కంగ్రాట్స్ అందుకోవోయ్!

"ధైర్యంగా ఆయనెవరో ముందుకు వస్తే సభకి పరిచయం చేస్తాను," అన్నాడు.

ఒక్కసారి—సో కాల్డ్ సభ నిశ్శబ్ద




మయిపోయింది. వాళ్లందరూ మొహ మొహాలు చూసుకున్నారు.

'నువ్వా ?'

'నువ్వా '

'కొంపతీసి నువ్వా ?'

— చూపుల బాకులతో ఒకర్నొకరు అనుమానంగా పొడుచుక చచ్చారు.

"నాకు తెలుసు. ఆయన రాడు. వస్తే యింకేముంది ? బ్రర రామకీర్తన పాడించి మన దారికి అడ్డు తొలగించుకుంటాం. ముందే మెన్షన్ చేసా. అతను లేక ఆమె చాపకింద నీరో తేలో.... అలాంటి మనిషి. ఉపన్యాస సావకాశం కోసం విజేతని 'అతను' అని వ్యవహరించుకుందాం. అతను ఎవరో కాదు....

"అధికార పక్షంలో సుముఖవర్గంలో ఏలుబడిలో వుంటూ అత్యధిక పలుకుబడి గల మంత్రిగారి బావమర్ది. లేకపోతే ఏదో లింక్ కనెక్టెడ్ జంటిల్మన్.

"లేక

"పదివేలో పన్నెండువేలో పాటరేటుకి ఒప్పందం కుదుర్చుకుని హార్డ్ కాష్ షెల్ డౌన్ చేసి ఉద్యోగం అడ్వాన్సుగా కొనుగోలు చేసిన ధీశాలి. అయనగారి 'మాంగారు'గానీ 'బావగారు'గానీ కువాయిట్ వెళ్లి కూలిపని చేసుకుని పెట్రోలు ధనం పంపించివుంటాడు. ఉద్యోగాలు కొనుక్కోవచ్చు. ఊళ్ళే కొనుక్కోవచ్చు.

"సో— సహజంగా ఉద్యోగాలు దొరికే

అవకాశాలు చాలా తక్కువ. అయితే ఇన్‌ఫ్లుయన్స్! లేకపోతే మనీ. ఈ రెండూ తప్పవిడిచి—ఒకటీ అరా దొరికే నిజాయితీ ఉద్యోగాలు ప్రత్యక్ష సాక్షులై మనల్ని కడకంటా ఇంటర్వ్యూలకి నిల బెట్టి ప్రాణాలు తోడుతున్నాయి. లేకపోతే ఎప్పుడో ఈ రంగానికి గుడ్‌బై చెప్పి ఉండేవాళ్లం.

"కాబట్టి ఫ్రెండ్స్-అంటే ఈ ఒక్క ఉద్యోగం ఉన్న ఇంటర్వ్యూ ప్లాటు ప్రీ ప్లాన్‌డ్ మర్డర్ కేస్. ఒకడి జీవితం కోసం రెండువందల తొంభై తొమ్మిది మందిని పథకం ప్రకారం పకడ్బందీగా హత్యచెయ్యడమన్న మాట.

"మన పైకం వేస్తు...డబ్బు వేస్తు.... కలలు వేస్తు....కన్నీళ్లు వేస్తు .. చివరికి నా ఉపన్యాసం వేస్తు. ఇలా అనుకుంటే జరగబోయే ఘోరం ఆగుతుందా? ఉహూ. ఖాళీ ఒకటి గాబట్టి ఉద్యోగం పాపం ఒకడికే యివ్వాలి. ఉద్యోగం ఒకడికే ఇవ్వాలి గాబట్టి....అది ఎక్కువ డబ్బుకి పాడుకున్నవాడికే యివ్వాలి. ఆ డబ్బుతో 'అయ్యగారు' జన్మజన్మల దారిద్ర్యం నించి గట్టెక్కాలి! ఏ పిల్ల పెళ్లి చెయ్యాలో....ఏ కొడుక్కి ఇంజ నీరింగ్ సీటు బ్లాకులో కొనుక్కోవాలో ....ఏం బ్రాందీషాపు బాకీ తీర్చాలో.... సవాలక్ష దరిద్రగొట్టు సమస్యలు....ఆ సమస్యల నుంచి ఒకడు బైటపడాలంటే ....అమాయకుల మెళ్లో సమస్యల ఉచ్చు బిగించాలి.

"సదరు అమాయకుడు ఉచ్చు నుంచి బైటపడ్డానికి తెలివి మరిగి, మీరి, అవి నీతికి ఆలవాలమై — ఉద్యోగానికి పోసిన వేలు రాబట్టుకోవాలి. యింకో రికరింగ్ ఎఫెక్ట్. ఒకరిమీద ఒకరు ఉచ్చులు పన్నుకోడమే యిందులో టెక్నిక్.

ఎవడి పరిధిలో వాడు దగా చేస్తేగానీ బతకలేని ప్రపంచం యిది.

క్షమించాలి. మళ్లీ సైడైపోయాను. కాబట్టి యిది గొప్ప ప్రతిష్టంభన. దీన్ని మనం తొలగించలేం. ఈ సమస్యను పరిష్కరించాలంటే మనమే ఈ ఫీల్డు నుంచి పైదొలగాలి.

మనం ప్రభుత్వోద్యోగాలకి ఎగ బడడం అనవసరం. నిజానికి మనకి చాలినన్ని ఉద్యోగాలు ప్రభుత్వంలో లేవు. మన ఉద్యోగం మనమే కల్పించు కోవాలి. వెస్టర్న్ కంట్రీస్‌లో 'ప్రభుత్వో ద్యోగాలు మా కెందుకు పనికిరానివాళ్ల గ్గానీ' అంటారట .... స్వతంత్రంగా బతకాలని ఉబలాటపడేవాళ్లు. మనకి ఆ ధైర్యం లేదు. అధైర్యం ఎక్కువ."

ఓ క్షణం ఆగాడు. జేబులోంచి రెడ్ విల్స్ పాకెట్ తీసాడు. ఒక సిగరెట్ ఉంది. తీసి నోట్లో పెట్టుకుని ఖాళీపాకెట్ భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. మళ్లీ ఒక సిగరెట్ కొనుక్కుని పాకెట్లో ఉంచుకుని 'పాకెట్ మెయింటైన్ చేస్తా

డన్నమాట —" అనుకున్నాడు ముందు వరుసలో ఒక యువకుడు. అతను ముందుకు వెళ్లి లైటర్ వెలిగించాడు. "థాంక్స్" అంటూ ఒక దమ్ములాగి — సాధికారంగా దట్టమైన పొగ వదిలి — మధ్య వ్యవధిలో ఉపన్యాసానికి కావల్సినంత మేటర్ ఆలోచించుకున్నాడు. "మనలో మొబైల్ టీకొట్టు ఎవరైనా పెట్టగలరా? బజ్జీబండి నడపడానికి సిద్ధపడేవాళ్లు ఎందరు? సెంటరు చూసి బండి పెడితే రోజుకు ఖర్చులుపోను వందరూపాయలు సంపాయించేవాళ్లున్నారు ....మీకు తెలుసా? ఏజ్ బార్ అయ్యేంత వరకూ ఈ ఉద్యోగాలకోసం వెయిట్ చెయ్యడంలోనే జీవితం అంతా వృధా చేస్తున్నాం ఈలోపు ఏదో వృత్తి, వ్యాపకం, టెక్నిక్ నేర్చుకుని నేర్పరితనం పెంచుకుంటే — ఆ దారి వేరు!

"ఎంతో కొంత పెట్టుబడి పెడితే యింతింతై అంతింతై మనల్ని ఆకాశానికి ఎత్తుతూంది. డబ్బు డబ్బుని కనే ఏర్పాటుంది. మీరు తిట్టుకుంటున్న వ్యవస్థ కొందరికి సుందర స్వప్నం. రంగుల హరివిల్లు. విల్లు వంచుకుని అందుకునేవాళ్ళకి రంగులు దొరుకుతాయి

"కొంచెం 'దగా' నేర్చుకోగలిగితే — బైట ప్రపంచంలో విస్తృతమైన దోపిడీ అవకాశాలున్నై. ప్రజలు కాళ్లు బారగా చాచుకొని కూర్చొన్నారు. బుర్రలో గుంజున్నవాడికి అంతా డబ్బే.

"మీకో జోక్ చెప్పాలనిపిస్తుంది. 'గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు' అంటూ నా ఫ్రెండొకడు బోర్డుపెట్టి లక్షలు గడిస్తున్నాడు. వాడు గల్ఫ్‌దేశాల గురించి ఏమీ ఎరగడు. వాడు మొదట అక్కడకు వెళ్లడానికి ట్రైచేసి దారుణంగా ఫెయిల్ అయ్యాడు.

"ఉద్యోగాల మీద అభిప్రాయం మార్చుకుని స్వతంత్రంగా బ్రతకండి. ఇదే నా ఆఖరి ఇంటర్వ్యూ. దీంతో నా ఏజ్ బార్ అయిపోతుంది. యిక ఏ ఇంటర్వ్యూకి వెళ్ళే అవసరం రాదు, శెలవ్."

* * *

మర్నాడు —

ఇంటర్వ్యూ ఫలితాలు తెలిసాయి. విజయలక్ష్మి వరించింది ఎవర్నో కాదు. 'స్టూల్' ఎక్కి గొంతు చించుకొని ఉపన్యాసం దంచిన యంగ్‌మాన్ని!

అతగాడు చెప్పింది అక్షరాలా నిజం. అంటే అతను మినిష్టర్ బావమర్ది కాదు.

కానీ —

ఆ రాత్రి జనరల్ మానేజర్‌ని కలుసుకుని పదివేలకు సెటిల్ చేసుకున్న కాండిడేట్‌కు పోటీకి వెళ్లి పన్నెండు వేలకి కుదుర్చుకున్నాడు కొత్తగా.